విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 23, మార్చి 2025

అవినీతిపై జిల్లా ఎస్పీ సమగ్ర విచారణ జరిపించాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో చలానా మామూళ్ల పేరుతో జరుగుతున్న అవినీతిపై జిల్లా ఎస్పీ సమగ్ర విచారణ జరిపి అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని సీపీఐ నాయకులు కోరారు. శనివారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.సోమన్న, ఏఐటియుసి పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు, మహిళా సమాఖ్య పట్టణ కన్వీనర్ సుశీలమ్మ పాల్గొని మాట్లాడుతూ పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో అధికారులు నిబంధనలు. చలానా పేరుతో మామూళ్ల వసూలు చేస్తుండడం జరుగుతుందని, పైకి మాత్రం కఠినంగా నిబంధనలను అమలు పరుస్తున్నామని చెప్పడం బాధాకరమైన విషయమని, గతంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ మీద కథనాలు ఎప్పుడు రాలేదని ఒక కానిస్టేబుల్ వ్యాపారాలు చేస్తున్న వారిని బెదిరించి మామూళ్ల వసూలు చేస్తున్నాడం గమనించి సిపిఐ నాయకులు జిల్లా ఉన్నతాధికార్లకు తెలియపరచగా అతన్ని ఇతర ప్రాంతాలకు బదిలీ చేయడం జరిగిందని తెలిపారు. ట్రాఫిక్ సిఐ మల్లికార్జున గుప్తా ట్రాఫిక్ నిబంధనలు పేరుతో ప్రజలను భయభ్రాంతులకు, తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం జరుగుతుందని, నేను మోనార్క్‌ని నేను ఎవరి మాట వినను అంటూనే మరోపక్క తన స్టేషన్ పరిధిలో ఉన్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో జరుగుతున్న అవినీతిపై ఏమి సమాధా నం చెప్తారని, ఆటో స్టిక్కర్లపై దోపిడీ, చలానా రూపంలో అవినీతి అందులో ఇతనికి భాగస్వామి ఉంటుందని భావిస్తు న్నామని, వెంటనే ఉన్నత పోలీసు అధికారులు ట్రాఫిక్ స్టేషన్లో జరుగుతున్న అవినీతి, చలాన్ రూపంలో దోపిడీలపై సమగ్ర విచారణ జరిపించి అవినీతికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో సిపిఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

నియోజవర్గ అభివృద్ధికి సహకరించాలి

డిప్యూటీ సీఎంను కోరిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - నందికొట్కూరు : మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఉమ్మడి కర్నూలు జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా 1.55 లక్షల ఫారం పాండ్ నిర్మాణం కార్యక్రమంలో భాగంగా శనివారం పాణ్యం నియోజకవర్గం, ఓర్వకల్లు మండలంలోని పూడిచెర్ల గ్రామంలో నీటి కుంట నిర్మాణానికి భూమిపూజ భారీ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా గౌరవ ఏపీ డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ హాజరయ్యారు. ఈసందర్భంగా నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్త జయసూర్య ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి నియోజవర్గ అభివృద్ధి, పలు సమస్యలపై ఆయనకు తెలియజేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వ వచ్చిన తర్వాత పంచాయతీ నిధులు ద్వారా గ్రామాల్లో సీసీరోడ్లు డ్రైనేజీలు మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందుతుందన్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో కొణిదల గ్రామానికి వాగ్దానం ఇచ్చిన ప్రకారం కొణిదెల గ్రామాన్ని, నందికొట్కూరు నియోజకవర్గంలో తాగునీటికి, సాగునీటికి సిసి రోడ్లు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్‌ను కోరారు.

కేజీబీవీలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : కేజీబీవీ పాఠశాలలో అడ్మిషన్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆత్మకూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఎస్ఓ శ్యామల తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర కేజీబీవీ ఎస్పీడీ ఆదేశాల మేరకు ఆరవ తరగతి ,మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌తో పాటు 7,8 తరగతిలో ఖాళీగా ఉన్నటువంటి సీట్ల కోసం విద్యార్థులు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. ఆరో తరగతిలో 40సీట్లు,మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్లో 40సీట్లు, ఏడవ తరగతిలో మూడు సీట్లు,ఎనిమిదవ తరగతిలో ఒక సీటు,ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈనెల 22వ తేదీ నుంచి ఆన్లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమవుతుందని ఏప్రిల్ నెల 11వ తేదీ వరకు గడువు ఉందని అర్హులైన విద్యార్థులు ఆన్లైన్ సెంటర్ నందు మీసేవ సెంటర్ నందు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోని వారిని అడ్మిషన్ల కోసం పరిగణలోకి తీసుకోరని కాబట్టి కేజీబీవీలో సీటు కావాలనుకునే విద్యార్థులు మొదటగా ఆన్లైన్ నందు తప్పక దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ

విశాలాంధ్ర - శ్రీశైలం : ప్రముఖ శైవ క్షేత్రంగా విరజిల్లుతున్న శ్రీశైలం మహా క్షేత్రంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో శ్రీశైలం చేరుకున్నారు భక్తుల రద్దీ కనుకూలంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉగాది మహోత్సవాలు 27నుండి ప్రారంభం కానుండటంతో కన్నడ భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది కాలినడకన వాహనాల్లో అధిక సంఖ్యలో భక్తులు శ్రీశైలం చేరుకొని పవిత్ర పాతాళగంగలో పుణ్య స్థానాలు వారి వారి మొక్కులను తీర్చుకుంటున్నారు. సుమారు 50వేలకు మంది పైగా భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారని అంచనా..

పేదరిక నిర్మూలనే పీ4 లక్ష్యం

పెట్టుబడిదారులు ముందుకు రావాలి

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా..

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పేదరికాన్ని నిర్మూలించడమే పీ-4 (ప్రభుత్వ-ప్రైవేట్-ప్రజల- భాగస్వామ్య) వ్యవస్థ లక్ష్యమని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్‌లో భాగంగా పేదరిక నిర్మూలనకు పి4 (ప్రభుత్వ- ప్రైవేటు- ప్రజల- భాగస్వామ్య) విధానంపై చర్చ, అభిప్రాయ సేకరణపై సమావేశం నిర్వహించారు. డిఆర్ఓ రామునాయక్, సిపిఓ వేణుగోపాల్, జిల్లా అధికారులు, ఎంపీటీసీలు జడ్పిటిసిలు, ఇతర ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, ఎన్జీఓ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్ లో భాగంగా పేదరిక నిర్మూలనకు పి4 విధాన కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంస్థల ప్రతినిధుల నుండి అభిప్రాయాలు సేకరిస్తున్నామని తెలిపారు. అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని చక్కటి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తే రాష్ట్ర ముఖ్యమంత్రి ఉగాది పండుగ రోజు లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు. ఇందు కోసం రాబోయే ఐదు సంవత్సరాలలో జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు ఏవిధంగా ముందుకు తీసుకెళ్లగలమో అన్న అంశాలపై అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. గతంలో మండల, నియోజకవర్గ, జిల్లా అభివృద్ధి ప్రణాళికలను ప్రభుత్వానికి నివేదించడం జరిగిందన్నారు. జిల్లా అభివృద్ధిలో ఆర్థిక, ఆర్థికేతర అంశాలు ఉంటాయని, ఆర్థిక అంశాలలో పి4 విధానాన్ని ప్రవేశపెట్టి జిల్లాను అభివృద్ధి చేయాలనేది రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచన అన్నారు.

బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శిగా జె.రవి మోహన్

విశాలాంధ్ర - డోన్ : డోన్ బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన జె.రవి మోహన్‌ను సీపీఐ నాయకులు సన్మానించారు. డోన్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో సహాయ కార్యదర్శిగా రవి మోహన్ నామినేషన్ వేశారు. ఆపదవికి ఇతరులు నామినేషన్ వేయలేదు. దీంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం సీపీఐ న్యాయవాదులు, నంద్యాల జిల్లా కార్యదర్శి, న్యాయవాది ఎన్.రంగనాయుడు, కౌన్సిలర్, న్యాయవాది పి.సుంకయ్య, సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు బి.నారాయణ, యం. రాముడు, మాజీ మండల కార్యదర్శి పులిశేఖర్, న్యాయవాదులు డివి రంగారెడ్డి, శేష శయన రావు,ఆర్, రాముడు, మద్దయ్య యాదవ్,యం. శ్రీనివాసులు,కావీశ్వరుడు జి.మద్దిలేటి, కురువ సంఘం నాయకులు మునిస్వామి, బాల మద్దయ్య, ప్రతాప్ యాదవ్ తదితరులు సన్మానించారు. ఈసందర్భంగా రంగనాయుడు మాట్లాడుతూ రవిమోహన్ కుటుంబం సీపీఐ పార్టీలో కొనసాగుతుందన్నారు. విద్యార్థి దశ నుండి ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్‌లో జిల్లా స్థాయిలో పనిచేశారన్నారు. ప్రస్తుతం సీపీఐ కృష్ణగిరి మండల సహాయ కార్యదర్శిగా, బి.బొంతి రాళ్ల సర్పంచ్‌గా ఉన్నారన్నారు. ఒక వైపు న్యాయవాది వృత్తిలో మరో వైపు రాజకీయాల్లో చురుగ్గా ఉన్నాడని కొనియాడారు. రాబోవు కాలంలో మరిన్ని పదువులు పొందాలని ఆకాంక్షించారు.

నీటి తరలింపుపై రైతుల ఆగ్రహం

విశాలాంధ్ర - వెలుగోడు : తెలుగుగంగ ప్రాజెక్టులో భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ ద్వారా కేసి కెనాల్‌కు నీటిని అధికారులు తరలిస్తున్నారు. ఈ ప్రతిపాదనపై మండలంలోని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెలుగోడు రిజర్వాయర్‌లో ప్రస్తుతము నాలుగు టిఎంసిల నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్ నుంచి వన్ ఆర్ తూమ్ ద్వారా 80 క్యూసెక్కులు వన్ ఎల్ తూము ద్వారా 40 క్యూసెక్కులు, మద్రాస్ మెయిన్ కెనాల్ ద్వారా నూరు క్యూసెక్కులు సాగు నీరు బయటికి తరలిపోతున్నాయి. రిజర్వాయర్ నుంచి ఇంఫాల్ రెగ్యులేటర్ ద్వారా కేసి కెనాల్కు 200 క్యూసెక్కులకు పైగా నీటిని లింకు ఛానల్ ద్వారా వెనుకకు తరలిస్తున్నారు. వెలుగోడు రిజర్వాయర్ నందు ఇప్పటికే సాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. రబీ లో తెలుగు గంగ ప్రాజెక్టు ఆయకట్టు కింద సాగు చేస్తున్న పంటలకు ఏప్రిల్ ఆఖరి వరకు నీటిని ఇవ్వాల్సి ఉంది. మండలానికి మరింత ఇబ్బంది కలిగేలా నీటిని తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని రైతులు విమర్శిస్తున్నారు. తెలుగుగంగప్రాజెక్టు ద్వారా ప్రభుత్వము రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, అందుబాటులో ఉన్న నీళ్లను కూడా వేరే ప్రాంతాలకు తరలించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు తమ పంటలకు సరిపడా నీటిని కల్పించాలని, ప్రాంతీయ అభివృద్ధి ప్రణాళికలో తమ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మండల రైతుల ఆగ్రహంతో పాటు అధికారుల తీరుపై విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈవిషయంపై తెలుగంగ అధికారులను వివరణ అడగగా జిల్లా కలెక్టర్, స్థానిక అధికార ప్రతినిధుల ఆదేశాలతోనే నీటిని విడుదల చేస్తున్నామని తెలుగు గంగ ప్రాజెక్టు ఏఈ శివ నాయక్ తెలిపారు.

తాగునీటి ఎద్దడి తలెత్తితే ఉద్యమం

విశాలాంధ్ర - జుపాడుబంగ్లా : గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తితే ఉద్యమిస్తామని వేసవి కాలం సమీపించక ముందే ఎండల తీవ్రత ఎక్కువ ఉందని అందువలన ప్రతి సచివాలయం దగ్గర తాగు నీటి కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా నాయకులు ఎం. రమేష్ బాబు అన్నారు. శనివారం జూపాడు బంగ్లాలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో సిపిఐ జిల్లా నాయకులు ఎం.రమేష్ బాబు మాట్లాడుతూ వేసవికాలం సమీపించక ముందే ప్రజలు ఎండ వేడిమితో అల్లాడుతున్నారని త్రాగునిటీ ఎద్దడి తలేత్త కుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఇప్పటికే ఉపాధి హామీ పనుల దగ్గర త్రాగునీటి కేంద్రాలు, మజ్జిగ సౌకర్యం లేదని టెంటు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ సౌకర్యాలు లేవని వారు అన్నారు. ప్రజలు అవసరాల నిమిత్తం సచివా లయ దగ్గరకు వస్తున్న తరుణంలో ప్రతి సచివాలయం దగ్గర తాగు నీటి కేంద్రాలు ఏర్పాటు, టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. అనేక ప్రాంతాల్లో బోర్ల దగ్గర పంపుసెట్లు లేవని తక్షణమే వాటిని గుర్తించి చేతి పంపు సేట్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి గ్రామంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని వారు కోరారు. లేనిపక్షంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తితే చూస్తూ ఊరుకోమని వారు హెచ్చరించారు.

అన్నదాన శిబిరంను ప్రారంభించిన సీఐ

విశాలాంధ్ర - నందికొట్కూరు : ఉగాది పండుగను పురస్కరించుకొని కాలినడకన వెళ్తున్నటువంటి కన్నడ భక్తులకు నందికొట్కూరు పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపం దగ్గర జువ్వాజి ఆంజనేయ గౌడ్ ట్రస్టు స్థలంలో వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసినటువంటి అన్నదాన శిబిరంను శనివారం ట్రస్టు ధర్మకర్త వీర కుమార్ గౌడ్‌తో కలిసి రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల కన్నా అన్నదానం మహా గొప్పదని మహా పుణ్యక్షేత్రమైన ఉగాదికి శ్రీశైలంకు కాలినడకన వెళ్లే కన్నడ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయడం చాలా మంచిది అన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు ప్రతి ఒక్కరికి ఉండాలని, ఈ అన్నదానం ఏర్పాటు చేసినటువంటి కీర్తిశేషులు జువాజి ఆంజనేయ గౌడ్ కుటుంబ సభ్యులకు ఆ దేవుని దీవెనలు ఎల్లవేళలా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జువ్వా జి ఆంజనేయగౌడ్ కుటుంబ సభ్యులు కరుణాకర్ గౌడ్, కిషోర్ గౌడ్, విజయ్ గౌడు, శేఖర్ గౌడ్, సురేష్ గౌడ్, రాజశేఖర్ గౌడ్, రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీకి అనుగుణంగా బోధన ఉండాలి

విశాలాంధ్ర - శిరివెళ్ల : బోధన పద్ధతులలో నూతన టెక్నాలజీకి అనుగుణంగా ఉంటూ విద్యార్థుల యొక్క ఉత్తమ ఫలితాల సాదనే లక్ష్యం గా ఉండాలని జీటీఎంఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇంద్రావతి పిలుపునిచ్చారు. మూడు రోజుల పాటు జరిగిన వర్క్ సాపులో అధ్యాపకులకు వృత్తి ఉద్యోగ నైపుణ్యత పై ప్రిన్సిపాల్ పలు సూచనలు సలహాలు ఇచ్చారు. శనివారం ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఇంద్రావతి మాట్లాడుతూ విద్యార్థులకు ఆసక్తి కలిగించి వారిలోని సృజనాత్మకతను, ప్రతిభను, వైవిద్యం,మేధస్సు మానసిక వికాసం వంటి బోధన పద్ధతులు ఉత్తమ విద్యార్థిగా తీర్చిదిద్దుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జనార్ధనుడు, శ్రీనివాస రెడ్డి, ఖాసిం సాహెబ్, గురు రమేష్ విజయరేఖ గాయత్రి, విజయ, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఢీ.. వ్యక్తి మృతి

విశాలాంధ్ర - బేతంచెర్ల : మండల పరిధిలోని ఆర్.ఎస్.రంగాపురం గ్రామంలో బైకును లారీ ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల మేరకు కర్నూలు జిల్లా, గూడూరు మండలం, నాగలాపురం గ్రామానికి చెందిన కురువ సుధాకర్(44), శివ బేతంచర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి స్వామి ఆలయ దర్శనానికి శనివారం వచ్చారు.స్వామి వారి దర్శనం ముగించుకుని, బైకుమీద తిరుగు ప్రయాణంలో రంగాపురం బస్టాండ్ సమీపంలో వెనుక నుండి వస్తున్న లారీ వేగంగా ఢీకొనడంతో కురువ సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందగా,శివకు స్వల్ప గాయాలు అయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు, చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో వృద్ధురాలిపై దాడి

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : మండల పరిధిలోని నల్ల కాలువ గ్రామంలో నిన్న సాయంత్రం జూపల్లి చాకలి రాములమ్మ వయసు 70 సంవత్సరాలు వృద్ధురాలపై దాడి చేసిన సంఘటన నల్ల కాలువ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు చెప్పిన వివరాల మేరకు నిన్న సాయంత్రం నాలుగు గంటల సమయంలో తమ కళ్ళం లో గొర్రె పిల్లలకు నీళ్లు పెట్టుతుండగా గ్రామానికి చెందిన విష్ణు, సన్నాఫ్ స్వాములు అనునతడు తమ కళ్ళం దొడ్డిలోకి వచ్చి గొంతు పట్టుకొని వెనక్కు నెట్టిగా ఆమె కింద పడి తలకు చిన్న రక్త గాయం అయిందని అంతలో ఆమె కేకలు వేయగా చుట్టుపక్కల వారందరూ రాగా అతను పారిపోయాడని ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టిన ఎస్సై వెంకట నారాయణ రెడ్డి మాట్లాడుతూ నిందితుడు మద్యం మత్తులో వృద్ధురాలుపై దాడి చేసి కిందకు నెట్టాడని ఇంకా పూర్తి వివరాలపై దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు.

అనుమతిలేని బయో మందులు అమ్మితే లైసెన్సులు రద్దు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : అనుమతి లేని బయో మందులు అమ్మితే సంబంధిత వ్యవసాయ దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని ఆత్మ కూరు వ్యవసాయ శాఖ ఏడిఏ ఆంజనేయులు, ఆళ్లగడ్డ మండల వ్యవ సాయ అధికారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం ఆత్మకూరు సబ్ డివిజన్ ఏడిఏ ఆంజనేయులు ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్ఆర్ అగ్రిటెక్ ధనలక్ష్మి వెంకటేశ్వర ట్రేడర్స్ దుకాణాలను పరిశీలించారు. అందులో భాగంగా అనుమతి లేని బయోమందులు రెండు లక్షల ఇరవై వేల రూపాయల విలువ గల వాటిని స్టాప్ సేల్స్ కింద ఇచ్చారు. ఈ తనిఖీలు నిరంతరం జరుగుతుంటాయని అనుమతి లేని బయో మందులను దుకాణాలలో విక్రయించవద్దని వ్యవసాయ అధికారులు సంబంధిత దుకాణదారులను హెచ్చరించారు. అనుమతులు లేకుండా అమ్మిన పక్షంలో దుకాణాల లైసెన్సులు రద్దు చేయడం జరుగుతుంది అని అధికారులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ హుస్సేన్ భాష పాల్గొన్నారు.

జల భద్రతలోనే భవిత సురక్షితం

విశాలాంధ్ర - రుద్రవరం : జల భద్రతలోనే భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందని మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఇంకుడు గుంతలు నూతనంగా ఏర్పాటు సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో అత్యంత సాధారణ సమ్మేళనాలలో నీరు ఒకటి. వ్యక్తిగత కణాల నుండి మొత్తం పర్యావరణ వ్యవస్థల వరకు అన్ని స్థాయిలలో జీవితానికి ఇది చాలా అవసరం. సూక్ష్మదర్శిని స్థాయిలో, జీవులు తమ శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడానికి, ఆర్ద్రీకరణను నిర్వహించడానికి వాటి మనుగడకు కీలకమైన శారీరక ప్రక్రియలను నిర్వహించడానికి నీటిపై ఆధారపడతాయి అని అన్నారు. ఉపాధ్యాయ బృందర్ సుధాకర్,మధు,అను రాధ, ఇషాక్, విజయలక్ష్మి,లలిత,హరి, జ్యోతీ ప్రియ,నాన్ టీచింగ్ సిబ్బంది ,విద్యార్థులు పాల్గొన్నారు.

కోవెలకుంట్లలో వడగండ్ల వర్షం

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : కోవెలకుంట్ల పట్టణంలో శనివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది ఉరుములు, మెరుపు లతో కూడిన వడగండ్లతో కూడిన భారీ వర్షం పడింది దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలు ఈ వర్షంతో కాస్త ఊరటం కలిగించింది. మిరప ,మొక్కజొన్న కలాల్లో ఉండడంతో రైతులు ఇబ్బంది పడ్డారు.

మంత్రి చొరవతో పాలీసెట్ పరీక్షా కేంద్రం

విశాలాంధ్ర - బనగానపల్లె : రోడ్లు భవనాలు శాఖా మంత్రి బీసి జనార్ధన్ రెడ్డి చొరవతో పాలీసెట్ పరీక్షా బనగానపల్లెలో నిర్వహిస్తున్నట్లు వాసవి పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ తెలిపారు. గతంలో పాలిసెట్ పరీక్ష కేంద్రం దూర ప్రాంతాలకు విద్యార్థులు వెళ్లి రాయవలసి ఉండగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ పరీక్ష కేంద్రాన్ని స్థానికంగా ఏర్పాటు చేశారన్నారు. దీంతో బనగానపల్లె, కోవెలకుంట్ల, అవుకు,సంజామల,కొలిమిగుండ్ల విద్యార్థులు సౌకర్యవంతంగా పరీక్షలు రాసేందుకు ఉపయోగపడుతుందన్నారు. పాలిసెట్ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఏప్రిల్ మూడో తేదీ నుంచి ఉచిత కోచింగ్ ఏర్పాటు చేస్తున్నామని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలిని తెలిపారు. పాలిసెట్ పరీక్ష కేంద్రాన్ని స్థానికంగా ఏర్పాటు చేసేందుకు కృషిచేసిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా బ్యాంకు పేరుతో.. కుచ్చుటోపి

- అధిక వడ్డీల ఆశలు చూపి, పెద్ద మొత్తంలో డిపాజిట్‌ల సేకరణ
- రూ.రెండు కోట్లతో ఉడాయించిన సీఈవో వెంకటరమణ
- సంఘం పేరుతో మహిళల నుండి కోట్లలో డిపాజిట్లు సేకరణ

విశాలాంధ్ర- కోవెలకుంట్ల : కోవెలకుంట్ల పట్టణంలో జనని పరస్పర సహకార పరపతి సంఘం పేరుతో ఏర్పాటుచేసిన మహిళా బ్యాంకు బోర్డు తిప్పేసేందుకు సిద్ధమైంది. ఆ సంస్థ సీఈవో వెంకటరమణ గత 20 రోజులుగా సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని అజ్ఞాతంలోకి వెళ్లడంతో డిపాజిటర్లు గగ్గోలు పెడుతున్నారు. పట్టణానికి చెందిన ప్రముఖ మహిళలు ఒక్కొక్కరు లక్షల్లో సొమ్మును ఆ పరపతి సంఘంలో డిపాజిట్ చేయడంతో వారిలో తీవ్ర ఆందోళన నెలకొంది. సీఈవో స్వస్థలం కడపకు వెళ్లి వచ్చిన వారికి నిరాశ మిగిలింది. జననీ మ్యాక్స్ లిమిటెడ్ సంస్థ వ్యవస్థాపక సీఈఓ వెంకటరమణ అందుబాటులో లేకపోవడంతో డిపాజిటర్లు పోలీస్ స్టేషన్ కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఈవో వెంకటరమణ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఎస్కేప్ అయ్యి వెళ్ళాడని మహిళా బ్యాంక్ సెక్రటరీ పద్మావతి అంటున్నారు. బ్యాంకు సీఈఓ వెంకటరమణ మాటలు నమ్మి తాము సభ్యులుగా చేరామని కొంతమంది మహిళలు అంటున్నారు. తమను చూసి పట్టణానికి చెందిన ఎందరో మహిళలు లక్షల్లో డిపాజిట్ చేశారని ఆ పరపతి సంఘం సెక్రటరీ పద్మావతి అంటున్నారు. మహిళలకు అధిక వడ్డీల ఆశ చూపించి భారీ మొత్తం రుణాలు ఇస్తామని డిపాజిట్లు సేకరించినట్లు ఆరోపణలు వున్నాయి కడప పట్టణానికి చెందిన వెంకటరమణ స్థానికంగా ఉన్న పరిచయాలను ఆసరాగా చేసుకుని నంద్యాల జిల్లాలో 5 బ్రాంచ్‌ల ఏర్పాటు చేసాడు. కోయిలకుంట్లతో పాటు, చాగలమర్రి, బనగానపల్లె, నంద్యాల తదితరచోట్ల జననీ మాక్స్ లిమిటెడ్ సంస్థ పేరుతో జనని పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం కార్యాలయాలు తెరిచి ఆ సంస్థల ద్వారావేలాది మంది మహిళల నుండి సుమారు 2కోట్ల మేరకు భారీ మొత్తంలో డిపాజిట్లు సేకరించి నట్లు తెలిసింది. ఈ సంస్థల్లో డబ్బు పొదుపు చేసిన డిపాజిటర్లు ఆ కార్యాలయం చుట్టూ తిరుగుతుండడంతో వారికి చెల్లించేందుకు నగదు అందుబాటులో లేకపోవడంతో ఆ సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. డిపాజిటర్ల నుండి ఒత్తిడి అధికం కావడంతో సీఈవో వెంకట రమణపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని కోవెలకుంట్లలో ఉన్న జనని సహకార సంఘం సెక్రటరీ పద్మావతి అంటున్నారు. కోవెలకుంట్లలో జననీ సహకార పరపతి పొదుపు సంఘం మహిళా బ్యాంకు పేరుతో జిల్లాలోని 5ప్రాంతాల లో బ్రాంచీలను ఏర్పాటు చేసి సుమారు 2కోట్ల రూపాయలకుపై గానే డిపాజిట్లు సేకరించి, బోర్డు తిప్పేసేందుకు సిద్ధమైన జననీ మ్యాక్స్ లిమిటెడ్ సంస్థ నిర్వాకం వెలుగులోకి వచ్చింది, గత 20రోజులుగా సీఈవోగా ఉన్న వెంకటరమణ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అజ్ఞాతంలోకి వెళ్లడంతో డిపాజిట్ దారులకు ఆందోళన రేకెత్తిస్తుంది. మహిళలకు అధిక వడ్డీల ఆశ చూపించి భారీ మొత్తంలో రుణాలు ఇస్తామని డిపాజిట్లు సేకరించినట్లు వెంకటరమణపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కడప జిల్లా కడపకు చెందిన ఏవి వెంకట రమణ అనే వ్యక్తి జననీ మ్యాక్స్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో గత 2021అక్టోబర్ 8న కోవెలకుంట్ల లో జననీ సహాయ సహకార పరపతి పొదుపు సంఘం పేరుతో, అప్పటి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేత మహిళా బ్యాంకును ప్రారంభోత్సవం చేపించారు. కోవెలకుంట్లలో బ్రాంచి ఏర్పాటు చేసిన అనంతరం, నంద్యాల, బనగానపల్లె, చాగలమర్రి లో మరో నాలుగు బ్రాంచి ఆఫీసులను సీఈవో వెంకట రమణ ప్రారంభించారు. స్థానిక పొదుపు మహిళా బ్యాంకు లో మహిళలకు నమ్మకం కలిగించే విధంగా బ్యాంకు గ్రూపు కమిటీకి 15 మంది మహిళలను నియమించి అధిక వడ్డీల ఆశ చూపించి భారీ మొత్తం రుణాలు ఇస్తామని వేలాది మంది మహిళల నుండి దాదాపు 2కోట్ల మేరకు భారీ మొత్తంలో డిపాజిట్లు సేకరించినట్లు సమాచారం. కోవెలకుంట్ల,మహిళ పొదుపు బ్యాంకు సెక్రెటరీగా ఉన్న పద్మావతి అనే మహిళ సహకారం తోనే సీఈవో వెంకట రమణ భారీ ఎత్తున డిపాజిట్స్ సేకరించి సొమ్ము చేసుకొని అజ్ఞాతం లోనికి వెళ్లినట్లు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గత కొంత కాలంగా సీఈవో వెంకటరమణ, మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి,ఎస్కేప్ అయ్యి వెళ్లడం తో పొదుపు మహిళా బ్యాంకు గ్రూపు కమిటీ సెక్రెటరీగా ఉన్న పద్మావతి తో పాటు, సభ్యులు, సిబ్బంది లబోది ఇవ్వమంటూ మొత్తుకుంటున్నారు. డిపాజిటర్లకు డబ్బులు చెల్లించ కుండా ఎస్కే ప్ ఐన సీఈవో వెంకటరమణ పై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసారు.

గ్రంధాలయంలో మౌలిక వసతులు కల్పిస్తా..

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో మౌలిక వసతులు కల్పిస్తానని రిటైర్డ్ హెడ్మాస్టర్ పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి సేవా సమితి అధ్యక్షుడు పి వెంకట సుబ్బారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రంథాలయం నందు గ్రంథాలయ అధికారి మనోహర్ కు పలు విజ్ఞాన, సాంస్కృతికఆధ్యాత్మిక, రాజకీయ, చరిత్ర, మత గ్రంథాలు తదితర పుస్తకాలను ఆయన అందించారు. గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలు పరిస్థితిని గ్రంధాల అధికారి ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయకేంద్రంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కంబయ్య, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

బయో మందుల అమ్మకాల నిలిపివేత

విశాలాంధ్ర - చాగలమర్రి : సరైన బిల్లులు, పత్రాలు లేకుండా ఎరువులు, మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఇంటర్నల్ స్క్వాడ్ అధికారి, ఆత్మకూరు వ్యవసాయ సహాయసంచాలకులు ఆంజనేయ, చాగలమర్రి ఏవో రంగనేతాజీ హెచ్చరించారు. చాగలమర్రి పట్టణంలోని పలు ఎరువులు, మందుల దుకాణాలను తనిఖీ చేశారు. పట్టణంలోని రైతు ఆగ్రో ఏజెన్సీల్లో రూ.19.9లక్షలు, శ్రీవెంకటేశ్వర ట్రేడర్స్లో రూ.2.49 లక్షల బయో మందులకు సంబంధించి. సరైన బిల్లులు, పత్రాలు లేనందున వాటి అమ్మకాలను నిలిపి వేస్తున్నామని వారు తెలిపారు. డీలర్లు ప్రభుత్వ అనుమతి పొందిన బయో సుందులను మాత్రమే విక్రయించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువుల దుకాణ దారులు రిజిస్టారు, బిల్లులు, పత్రాలు సక్రమంగా ఉంచుకోవాలని లేనిచో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

చీరె, సారేతో శ్రీశైలానికి...

- బారీగా కాలినడకన బయలు దేరిన కన్నడ భక్తులు
- భక్తులకు స్వచ్ఛందంగా భోజనాలు, నీరు, మజ్జిగ

: తమ ఆడపడచు శ్రీశైలభ్రమరాంబ దేవికి చీరె, సారే, పసుపు కుంకుమ తీసుకుని కన్నడ భక్తులు పాదయాత్ర ద్వారా శ్రీశైలంకు బయలు దేరారు. కన్నడ ప్రజలు శ్రీశైల భ్రమరాంబ దేవిని తమ ఇంటి ఆడపడచుగా బావిస్తారు. ప్రతి ఏడాది వారు ఉగాది పర్వదినంకు తమ ఆడపడచుకు చీరసారే, వసుప, కుంకుమ తీసుకుపోయి అక్కడ నైవేద్యం వండి అమ్మవారికి సమర్పించి రావడం ఆనవాయితి. కర్నాటకలోని బాగల్‌కోట్, రాయిచూరు, సిరిమొగ్గ, సింథనూరు, కాటికి, యాదగిరి, బళ్ళారి, బీజాపూరు, బీదర్, బెల్గాం తదితర ప్రాంతాల నుండి పాదయాత్ర ద్వారా ఉగాది పర్వదినంకు శ్రీశైలంకు చేరుకుం టారు. ఈ పర్వదినంకు ప్రతి గ్రామం నుండి ఇంటికి కచ్చితంగా ఒకరు లేదా ఇద్దరు పాదయాత్ర ద్వారా శ్రీశైల భ్రమరాంబ మల్లిఖార్జున

స్వామి దర్శించు కోవడం జరు గుంది. సుమారు 900 కిలోమీటర్ల మేరా వారు నడిచి శ్రీశైలం చేరుకుంటారు. ఉగాది పర్వదినంకు నెలరోజుల ముందు వారు శ్రీశైలంకు బయలు దేరతారు. సుమారు 6లక్ష మందికి పైగా నంద్యాల జిల్లా వెంకటాపురం మీదుగా నల్లమల కొం దల మధ్య నుండి శ్రీశైలం చేరుకుంటారు. పాదయాత్ర భక్తులు ఓం నమ శ్శివాయ, హరహరమహాదేవ శంభోశంకర అనే నినాదాలతో నల్లమల కొండలు మరుమోగుతున్నాయి. పాదయాత్ర భక్తు లకు దారి పొడవున నీరు, మజ్జిగ, భోజనం, పెరు గన్నము, అరటిపండ్లు లాంటివి స్వచ్ఛందంగా అందచేస్తున్నారు. నల్లమల అడవుల్లో పారెస్టు, దేవాదాయ, రెవెన్యూ శాఖల అధి కారులు భక్తులకు ఉచిత భోజనం, నీరు, ఉచిత మెడికల్ క్యాం ప్‌లు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు వేసవి తాకిడికి తట్టు కోలేక సీఆర్ భవన్ (సీపీఐ) కార్యాలయం, అయ్యప్ప స్వామి దేవాలంలో సేద తీర్చుకుంటున్నారు. పాదయాత్రలో వృద్దుల తో పాటు స్త్రీలు, యువకులు ఎక్కువగా ఉండటం విశేషం.

– విశాలాంధ్ర బ్యూరో, కర్నూలు

కన్నడ భక్తులకు సీఆర్ భవన్‌లో ఉచిత వసతి

కన్నడ భక్తులకు సీఆర్ భవన్‌లో ఉచిత వసతి ఏర్పాటు చేశారు. శనివారం సీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో కర్ణా టక నుండి శ్రీశైలం వెళ్లే కాలినడక భక్తులకు ఉచిత వసతి కేంద్రాన్ని సీఆర్ సేవా సమితి అధ్యక్షులు కె.జగన్నాథం, కోశాధికారి పి.రామ కృష్ణా రెడ్డిలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ శ్రీశైలం కి వెళ్లే కర్ణాటక భక్తులకు చంద్రా రాజేశ్వరరావు భవనం నందు విశ్రాంతి తీసు కోవడానికి వసతి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిం దన్నారు. హాల్లో ఫ్యాన్లు, స్నానాల ఏర్పాట్లు చేయ డం జరిగింద న్నారు. కాలినడక యాత్ర బాగా జరగాలని, ఎలాంటి ఆటం కాలు లేకుండా క్షేమంగా దర్శనం చేసుకుని తిరిగి వారి స్వగ్రా మాలకు చేరుకో వాలని ఆకాంక్షించారు. ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి నాగ రాజు, విశా లాంధ్ర బ్రాంచ్ మేనేజర్ నాగ రాజు, కర్ణాటక భక్తులు పాల్గొన్నారు.

నగరంలో పన్ను వసూళ్లకు ప్రత్యేక కౌంటర్లు

శాలాంధ్ర – కర్నూలు సిటీ : నగరపాలక సంస్థకు సంబంధించి ఆస్తి పన్ను, తాగునీటి కొళాయి చార్జీలను ప్రజలు సులువుగా చెల్లించేందుకు నగరంలోని కల్లూరు వార్డు కార్యాలయంలో 85వ సచివాలయం, జేఎస్ఆర్. నగర్ (సి.క్యాంపులో 62వ సచివాలయం బాలాజీ నగర్ లో 104వ సచివాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు కమి షనర్ ఎస్.రవీంద్ర బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగుస్తుందని, ఇప్పటికే క్షేత్ర స్థాయిలో సిబ్బంది విస్తృతంగా తిరుగుతూ, పన్ను వసూళ్లను వేగవంతం చేసినట్లు వెల్లడించారు. నగరపాలక కార్యాలయంతో పాటు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పన్ను వసూలు కేంద్రాలు ఆదివారం సైతం తెరిచే ఉంటాయని, ప్రత్యేక కౌంటర్లలో ఉదయం 7 నుండి రాత్రి 7 లోపు ప్రజలు తమ పన్నులను చెల్లించవచ్చన్నారు. అదేవిధంగా ప్రజలు ఇంటి నుంచే డిజిటల్ ప్లాట్‌ఫాంలలో పన్నులను చెల్లించవచ్చని, వాట్సాప్ నెంబర్ 9552300009, పురసేవ యాప్, వెబ్‌సైట్ https://cdma.ap.gov.in/en/ptpaymentsలలో ఏదైనా ఒక పద్దతిలో పన్నులను చెల్లించవచ్చని కమిషనర్ సూచించారు. ఒకవేళ నగదు రూపంలో చెల్లించాలనుకుంటే స్థానిక సచివాలయం, మీ సేవ, ఆన్‌లైన్ కేంద్రాలు, వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలలో లేదా నగరపాలక సంస్థ కార్యాలయంలో పన్నులు చెల్లించవచ్చని సూచించారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన తహశీల్దార్

విశాలాంధ్ర -గోనెగండ్ల: మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం తహశీల్దార్ కుమారస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ గ్రామాల నుంచి నిత్యం ప్రజలు తహశీల్దార్ కార్యాలయానికి వస్తుంటారని, వేసవి కాలంలో వారి దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామ న్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శిరీష, ఆర్ఐ జనార్ధన్ రావు, అటెండర్ రామన్న, టీడీపీ నాయకులు ఎన్వీ రామాంజనేయులు, శ్రీధర్ నాయుడు, ట్రాక్టర్ ఉసేన్, ఎన్వీ బాబు నాయుడు, అడ్వకేట్ వెంకటేశ్వర్లు, అధికారులు, గ్రామ వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పరిశీలించిన కమిషనర్

విశాలాంధ్ర – కర్నూలు సిటీ : నగరంలోని కొండారెడ్డి బురుజు సమీపం లోని అన్న క్యాంటీన్‌ను శుక్రవారం రాత్రి నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు పరిశీలించారు. ప్రజలను ఆహార నాణ్యత, రుచులను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్యం పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

విశాలాంధ్ర – వెల్దుర్తి: అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడం వల్ల తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా పీడీ నిర్మలఅన్నారు. శనివారం మండల పరిధిలోని రామళ్లకోట, వెల్దుర్తి, గ్రామాలలో అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ పడాయి బీ కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం జరిగింది. చిన్నారులకు ఆటపాటలతోనే అక్షరాలు నేర్పించేందుకు కృషి చేయాలనిచెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ శ్రీదేవి, సుగుణమ్మ, సరస్వతమ్మ, సునీత, లలితమ్మ, అమ్ములు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్తుపై దృష్టి పెట్టాలి

విశాలాంధ్ర – క్రిష్ణగిరి: పిల్లలు ఎదుగుదల వారి భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని సీడీపీవో లూకా అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కేజీ బీజీ పాఠశాల నందు అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పోషణ బీ, పడాయి బీ అనే కార్యక్రమం కింద జీరో నుండి నుండి ఆరేళ్ల లోపు పిల్లల అభివృద్ధిపై మూడు రోజులపాటు అవగాహన సదస్సు కల్పించడం జరిగిందన్నారు. పిల్లల యొక్క సామ ర్థ్యం, ఎదుగుదల, పోషణ, భాషాభివృద్ధి, శారీరక అభివృద్ధి, మేథో అభివృద్ధి తదితర వాటిపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకు భవిష్యత్తు తరాలకు సంపూర్ణ అక్షరాస్యత, ఆరోగ్యం అందించే ప్రక్రియ కార్యక్రమాన్ని అంగ న్వాడీ కార్యకర్తలు చేపట్టాలని ఆయన తెలిపారు. ఐసిడిసి సూపర్వైజర్లు సునీత, సుగుణ, కార్యకర్తలు సురేఖ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జరిగిన బడేరాత్

విశాలాంధ్ర -హొళగుంద: హొళగుందలో ముస్లిం సోదరులు రంజాన్ నెలలో ఎంతో పవిత్రంగా భావించే ఐదు బడే రాత్రుల్లో మొదటి బడే రాత్‌ను ముస్లిం సోదరులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జమతి ఆలహదీస్, అహలేస్తున్న తుల్జామాద్, టబ్లిక్ జమాత్, మసీదులలో రాత్రంతా ముస్లిం సోదరులు నమాజులు చేసి కురాన్ ను చదివారు. ఆయా మసీదుల్లో బడే రా సందర్భంగా మౌల్ వీలు ముస్లింల నుద్దేశించి ఉపన్యాసించారు. పేదల ఆకలి తీర్చడమే రంజాన్ నెల ముఖ్య ఉద్దేశం అని, రంజాన్ నెల ముస్లిం సోదరులకు ఎంతో పవిత్ర మాసం గా అభివర్ణించారు. ముస్లిం సోదరులు రంజాన్ నెలలో నిరు పేదలకు, వితంతువులకు, బలహీనులకు, దివ్యాంగులకు దానధర్మాలు చేసి ఆదుకోవాలని ఉపదేశించారు. బడే రాత్‌లో రాత్రి ఫిర్నీ, పాయాసం, తేనేటి పానకం లను పంపిణీ చేశారు.

వైసీపీ పాలనలో ఆరాచకమే తప్ప అభివృద్ధి లేదు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర – ఓర్వకల్లు : వైసీపీ ఐదేళ్ల పాలనలో అరాచకం తప్ప అభివృద్ధి లేదని, సర్పంచ్‌లు బిక్షాటన చేశారని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం ప్రపంచ జలదినోత్సవం పురస్కరించుకుని జిల్లా ఓర్వకల్లు మండలం, పుడిచెర్ల గ్రామంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్ర వ్యాప్తంగా ఇంకు డు గుంతల శంఖుస్తాపన కార్యక్రమానికి భూమి పూజ నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి చరితారెడ్డి మాట్లాడుతూ 2024 ఎన్నికలలో టీడీపీ ఇచ్చిన హామీ లన్ని అమలు చేస్తున్నామన్నారు. వైసీపీ స్థానిక సంస్థ లను నిర్వీర్యం చేసిందన్నారు. సర్పంచ్‌లకు బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లుకునేందుకు నిధులు లేవ న్నారు. చివరకు సర్పంచ్‌లు బిక్షాటన చేసుకోవలసి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారం లోకి రాగానే 1450 కోట్లు విడుదల చేసి గ్రామాల్లో తాగునీరు, వీధిలైట్లు, బ్లీచింగ్, డ్రైనేజీ క్లీనింగ్‌కు,

ఉపయోగించడం జరిగిందన్నారు. జిల్లాలో వంద శాతం సీసీ రోడ్డు వేయడం జరిగిందని, జిల్లా 10వ స్థానంలో ఉంటే పాణ్యం నియోజకవర్గం మొదటి స్థానంలో ఉందన్నారు. బడ్జెట్‌లో రూ.2800 కోట్లు మంజూరు చేసి ఇండస్ట్రీయల్ హబ్‌కు మౌళిక వస తుల కల్పనకు ఖర్చు చేయడం జరుగు తుందన్నారు.

బ్రిడ్జి కమ్ బ్యారేజ్ నిర్మాణం చేయాలి : రాయలసీమ సస్యశ్యామలం కావాలంటే సిద్దేశ్యంపై బ్రిడ్జి కమ్ బ్యారేజ్ నిర్మాణం చేయాలని దీంతో రాయలసీమలో నీటి సమస్య ఉందని, దీని ద్వారా 60 టీఎంసీల నీరు నిల్వ ఉంటుందని ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. ఉపాధి హామీ పథకంను వ్యవసాయంకు అనుసం ధానం చేయాలన్నారు. ఉగాది పండుగ వారం ముందుగానే తీసుకు వచ్చారన్నారు. నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తాజయసూర్య మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధి సూన్యమన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నందికొట్కూరు నియోజకవర్గంలోని కొణిదెల గ్రామాన్ని దత్తత తీసుకోవాలన్నారు. అంతకు ముందు విమానశ్రయంలో డిప్యూటీ ఈసీఎం పవన్ కళ్యాణ్‌కు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జనసేనా నాయకులు చింతా సురేష్, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్‌గౌడ్, కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ విక్రాంత్‌పాటిల్, ప్రిన్సిపల్‌సెక్రేటరి శశిభూషన్, కమీషనర్ క్రిష్ణతేజ, సర్పంచ్ లళితమ్మ పాల్గొన్నారు.

పంట పొలాలకు సాగునీరు అందించాలి

విశాలాంధ్ర -పత్తికొండ: హంద్రీనీవా ప్రధాన కాలువ కింద ఉన్న ఎడమ కాలువను పొడిగించి, పంట పొలాలకు సాగునీరు అందించాలని సీపీఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి బి.సురేంద్ర కుమార్‌లు డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని చిన్నహుల్తి, జూటూరు గ్రామాలలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పందికోన రిజర్వా యర్ కింద ఉన్న ఎడమ కాలువను హెూసూర్, పెద్దహుల్తి, చిన్నహుల్తి గ్రామా ల మీదుగా దేవనబండ, అటికెల గుండు, నలకదొడ్డి, జూటూరు ఆస్పరి మండలం బిల్లేకల్, వెంగళాయ దొడ్డి వరకు పొడిగించి పనులను పూర్తి చేసినట్లయితే 20 వేల ఎకరాలకు సాగునీరు ఆయా గ్రామాలకు తాగునీరు అందుతుందన్నారు. రైతుల నుంచి సేకరించిన సంతకాల సేకరణ కాపీలను ముఖ్యమంత్రికి పంపుతామన్నారు. ఎడమ కాలువను పొడిగించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న గ్రామ సచివాలయాల ఎదుట జరిగే ధర్నా కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు కారన్న, తిమ్మయ్య, నాయకులు నాగిరెడ్డి, కౌలుట్ల పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర – కర్నూలు వైద్యశాల: గార్గేయపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నందనపల్లి సచివాలయం నందలి గోపాలపురంలో వడ దెబ్బ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డెమో శ్రీనివాసులు శెట్టి వడదెబ్బ లక్షణాల గురించి మాట్లాడుతూ తలనొప్పి, తల తిరగటం, తీవ్రమైన జ్వరం, మత్తు నిద్ర కలవరింతలు, ఫిట్స్ లేదా పూర్తి అపస్మారక స్థితి వంటి లక్షణాలు ఉండునని తెలిపారు. ఇంటి నుంచి బయటకు వెళ్ళేముందు ఒక గ్లాసు మంచి నీరు తాగాలని, ఎండలో నుంచి వచ్చిన వెంటనే చల్లని నిమ్మరసముగాని, కొబ్బరి నీరు లేదా చల్లని నీరు తాగాలని సూచించారు. వైద్యాధికారి డాక్టర్ అబ్దుల్ అనీద్, డిప్యూటీ డెమో చంద్రసేకర రెడ్డి, పబ్లిక్ హెల్త్ నర్స్ హనుమంతమ్మ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ యశోద, ఆరోగ్య కార్యకర్తలు మాలిక్ బాష, అనిత, ఆశా కార్యకర్తలు సులోచన పాల్గొన్నారు.

డంప్ యార్డ్‌ను తొలగిచాలి: సీపీఐ

విశాలాంధ్ర -ఎమ్మిగనూరు: పట్టణం లోని సోగనూరు రోడ్డు సమీపంలో ఉన్న వ్యర్థ పదార్థాల డంప్ యార్డ్‌ను తక్షణమే తొలిగించి, ఆ ప్రాంత ప్రజల ప్రాణాలను కాపాడాలని సీపీఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న కోరారు. శనివారం సీపీఐ ఆధ్వర్యంలో జోగి కాలనీ ప్రజలతో కలసి ప్రమాద కరమైన వ్యర్థ పదార్థాల డంప్ యార్డ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా జి.రంగన్న మాట్లాడుతూ పట్టణంలోని వ్యర్థ పదార్థాలను తీసుపోయి జోగి కాలనీ, జగనన్న కాలనీ, టిడ్కో గృహాల సమీపంలో డంపు చేయడం వల్ల ఆ ప్రాంత ప్రజలు దుర్వాస నను పీల్చుతూ అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. యార్డ్‌లో ఉన్న వ్యర్థ పదార్థాలను తినడానికి కుక్కలు వందల సంఖ్యలలో వస్తున్నాయని, ఆ కుక్కలు దారిన పోయే ప్రజలపై దాడి చేయడం జరిగిందని కాలనీ ప్రజలు తెలిపారు. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్న వ్యర్థ పదార్థాల డంపు యార్డ్‌ను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు మల్లికార్జున గౌడ్, నరసింహులు, రాజు, ఎల్లప్ప పాల్గొన్నారు.

భగత్ సింగ్ 94వ వర్ధంతిని జయప్రదం చేయండి

విశాలాంధ్ర – ఆదోని క్రైం : భగత్ సింగ్ 94 వ వర్ధంతిని జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ పట్టణ అధ్య క్షులు బసాపురం లింగప్ప పిలుపు నిచ్చారు. శనివారం ఏఐవైఎఫ్ కార్యా లయంలో కార్యవర్గ సమావేశం జరి గింది. ఈ సమావేశానికి సీపీఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్ హాజర య్యారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు, బసాపురం లింగ ప్ప, అంజిత్ గౌడ్, సీపీఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్‌లు మాట్లాడుతూ దేశ స్వతంత్రం కోసం 23 సంవత్సరాలకే తమ ప్రాణాలను ద్రుణప్రాయంగా అర్పించిన విప్లవ కిశోర్యులు సర్దార్ షాహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల వర్ధంతి మార్చి 23న ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి విజయ్, ఏఐవైఎఫ్ సహాయ కార్యదర్శి లింగప్ప, నాయకులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

విశాలాంధ్ర – ఓర్వకల్లు: జిల్లా పర్యటనకు విచ్చే సిన ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కు ఓర్వకల్లు ఎయిర్పోర్ట్‌లో ఘన స్వాగతం పలి కారు. శనివారం జిల్లా ఓర్వకల్లు మండలం పూడిచెర్ల గ్రామంలో ఫాం పాండ్ నిర్మాణ పనులను ప్రారంభించేం దుకు జిల్లాకు విచ్చేసిన ఉప ముఖ్యమంత్రికి ఓర్వకల్లు విమానా శ్రయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, డీఐజీ కోయ ప్రవీణ్, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, నందికొట్కూరు ఎమ్మెల్యే జయ సూర్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, టీటీడీ సభ్యులు మల్లెల రాజశేఖర్, డిఎఫ్ఓ శ్యామల, నందికొట్కూర్ ఇంచార్జ్ గౌరు వెంకటరెడ్డి, ఎయిర్పోర్ట్ డైరెక్టర్ విద్యాసాగర్, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. పూడిచెర్లలో ఫారం పాండ్ నిర్మాణ పనులను ప్రారంభించి, బహిరంగసభలో పాల్గొన్న అనంతరం ఓర్వకల్లు విమా నాశ్రయం నుండి మధ్యాహ్నం 12.56 గంటలకు ఉప ఖ్యమంత్రి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్ళారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే జయ సూర్య తదితరులు వీడ్కోలు పలికారు.

రిటైర్డ్ ప్రిన్సిపాల్ సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర – కర్నూలు వైద్యశాల: కర్నూలు మెడికల్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్, కార్డియాలజీ విభాగపు అధిపతి డాక్టర్ టిరామకృష్ణారెడ్డి సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. శనివారం ఆయన సంతాప సభ ఓల్డ్ సీఎల్.ఈ యందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిటీ నరసింహ మాట్లాడుతూ కార్డియాలజీలో మొదటిసారిగా ఐసీయూ భాగాన్ని డాక్టర్ టిరామకృష్ణారెడ్డి ఏర్పరచి, అధునాతన చికిత్సలు నిర్వహించారని కొనియాడారు. ప్రొఫెసర్, రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కార్డియాలజీ విభాగానికి రిటైర్డ్ ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి సేవలు ఎప్పటికీ మరువలేమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.సాయి సుధీర్, వివిధ విభాగాధిపతులు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ లక్ష్మి బాయి, డా.రాధారాణి, డా.రాంశివ నాయక్, డా.శ్రీనివాసులు, డిప్యూటీ సూపరెండెంట్ డాక్టర్ శ్రీరా ములు, డా.డమ్మమ్ శ్రీనివాసులు వివిధ విభాగాల ప్రొఫెసర్లు అసిస్టెం ట్లు, అసోసియేట్లు, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కేవీ సుబ్బారెడ్డి కాలేజీలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక రెడ్ క్రాస్ సంస్థ వద్ద రక్తం కొరత ఏర్పడటంతో డా.కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీని సంప్రదించడంతో సంస్థ పోషకుల్లో ఒక రైన కైపా విశ్వ మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం మెగా రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారు. 150 మందికి పైగా విద్యార్థులు, అధ్యాపకులు, ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రక్త కొరత తీరేలా మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్‌ను ఏర్పాటు చేసిన కేవీ సుబ్బారెడ్డి కాలేజీల యాజమాన్యానికి, పాల్గొన్న కళాశాల ప్రిన్సిపల్ కె.కన్నా కుమార్, ఎంబీఏ హెచ్ఓడీ మెహబూబ్ బాష, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆనంద రాంబాబు, రెడ్ క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చైర్ పర్సన్ పదవి కోసం కోటి రూపాయల అడ్వాన్స్

- మాజీ ఎమ్మెల్యే మనసును మార్చిన కౌన్సిలర్లు
- మున్సిపల్ చైర్పర్సన్ శాంత

విశాలాంధ్ర – ఆదోని : ఆదోని మున్సి పల్ చైర్ పర్సన్ పదవి కోసం ఎన్నికల ముందే వైసీపీ నాయకుడు నాగరాజు భార్య కౌన్సిలర్ లోకేశ్వరిని మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఎన్నుకునేందుకు వైసీపీ నాయకుడు చంద్రకాంత్ రెడ్డికి నాగ రాజు కోటి రూపాయలు ఇచ్చారని మున్సి పల్ చైర్ పర్సన్ శాంత ఆరోపించారు. జగ 'నన్న న్యాయం చెప్పన్నా' అంటూ మూడవరోజు చైర్పర్సన్ శాంత నిరసన తెలియజేస్తూ విలేకరు లతో మాట్లాడారు. మున్సిపల్ చైర్ పర్సన్‌గా కౌన్సి లర్ లోకేశ్వరిని చేసేందుకు కోటి రూపాయల అడ్వాన్సుగా ఇచ్చిన మొత్తంలో రూ.50 లక్షలు వాపసు ఇచ్చారని, లోకేశ్వరి భర్త నాగరాజే స్వయం గా తనకు, తన భర్త సింహం నాగేంద్రకు తెలిపా రన్నారు. పట్టణంలో అభివృద్ధి లేదంటూ, నీటి సమస్య ఉందంటూ తనపై వైసీపీ కౌన్సిలర్లు ఆరోప ణలు చేయడం హాస్యాస్పదమని అన్నారు. కౌన్సిలర్ సందీప్ రెడ్డి ఏక వచనంతో మాట్లాడకుండా చూసు కొని మాట్లాడాలని సూచించారు. కౌన్సిల్ సమా వేశంలో వైసీపీ కౌన్సిలర్లు వైస్ చైర్మన్‌ల సీట్ల కోసమే కింద కూర్చున్నారే తప్ప పట్టణ అభివృద్ధి కోసం కాదని, మూడు నెలల పాటు కౌన్సిల్ని వాయి దాలు వాయిదాలు వేసుకుం టూ వచ్చి అభివృద్ధిని అడ్డుకు న్నది మీరు కాదా అని కౌన్సి లర్లను ఆమె ప్రశ్నించారు. చైర్పర్సన్ పదవి నుండి దించేం దుకు కొంతమంది కౌన్సి లర్లలో ఒక్కొక్కరికి రూ.1.50 లక్షలు మాట ప్రకారం అందు లోనుండి అడ్వాన్సుగా రూ.50 వేలు తీసుకున్నది ముమ్మాటికి నిజమేనన్నారు. ఒకవేళ కౌన్సిలర్లకు డబ్బులు ఇవ్వ లేదని చంద్రకాంత్ రెడ్డి అంటున్నారే ఉరు కుంద ఈరన్న సాక్షిగా తల స్నానం చేసి కౌన్సిలర్లు డబ్బులు తీసుకోలేదని దేవుని సన్నిధిలో దీపం ఆర్పేందుకు చంద్రకాంత్ రెడ్డి సిద్ధమా అని సవాల్ విసిరారు. 2024 ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఇంటికి వెళ్లగా బాధపడకుండా మరో రెండేళ్లు మున్సిపల్ చైర్పర్సన్ గా నీవే కార్యకర్తలకు, పట్టణ అభివృద్ధికి పాటుపడాలని చెప్పడం జరిగిందని తెలిపారు. అంత మాట చెప్పిన మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి మనసును వైసీపీ నాయకుడు చంద్రకాంత్ రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్ సందీప్ రెడ్డిలు మార్చి మున్సిపల్ చైర్ పర్సన్ కచ్చితంగా మార్చాలని చెప్పడంతోనే మాజీ ఎమ్మెల్యే వారి మాట వినడం బాధగా అనిపించిందన్నారు. మున్సి పల్ చైర్ పర్సన్ హెూదాలో ఉండి ఏనాడు అవినీ తికి పాల్పడలేదని, మున్సిపల్ అధికారులను బెది రించలేదని, హెూదాలో ఉండే కారు, ఇంటికి పని మనిషి, లాంటి సౌకర్యాలు అనుభవించలేదని గుర్తు చేశారు. కేవలం మున్సిపాలిటీ దోచుకు నేందుకే చైర్పర్సన్‌ను మార్చాలన్న లక్ష్యంగా కొంతమంది కౌన్సిలర్లు పెట్టుకోవడం జరిగిందని విమర్శించారు. తన భర్త సింహం నాగేంద్ర ఏ పార్టీలో ఉన్న హుందాతనంగా అవినీతి చేయకుండా ఉన్నాడే తప్ప చిల్లర రాజకీయాలు చేయలేదన్నారు. వైసీసీ నాయకుడు చంద్రకాంత్ రెడ్డి కౌన్సిలర్ లోకేశ్వర్కే కాకుండా వేరే కౌన్సిలర్లు సీనియర్లు నాగరత్నమ్మ, ప్రతిభ ఉన్నారు కదా వారికి చైర్పర్సన్ పదవి ఎందుకు ఇవ్వడం లేదు అని ప్రశ్నించారు. పదవి వ్యామోహం కోసం ఏనాడు పాకలాడలేదని, షీల్డ్ కవర్లో జగనన్న నా పేరు పంపడం వల్లే చైర్స్ పర్సన్ పదవి పొంది అవినీతి లేకుండా, అధికా రులను బెదిరించకుండా చేతనై నంత ప్రజాసేవ చేశానని చైర్పర్సన్ శాంత అన్నారు. ఏది ఏమైనప్పటికీ వైసీపీ కౌన్సిలర్ల అవిశ్వాసం కోసం కలెక్టర్‌ను కలవడం, చైర్పర్సన్ దీక్ష చేపట్టడం, చైర్పర్సన్ వర్సెస్ కౌన్సిలర్లు ఒకరిపై ఒకరు ప్రెస్‌మీట్లతో ప్రశ్నా జవాబులు ఇచ్చుకోవడంపై ప్రజలందరూ ఎవరికి తోచిన విధంగా వారు పలు రకాలుగా చర్చించుకుంటున్నారు.

పత్తికొండలో సబ్‌కోర్టు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-పత్తికొండ: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన పత్తికొండలో సబ్ కోర్టు ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.రంగస్వామి, సీనియర్ న్యాయవాది సత్యనారాయణలు విజ్ఞప్తి చేశారు. శనివారం జిల్లా కోర్టులో జరిగిన వర్క్ షాప్‌కు హాజరైన ఏపీ రాష్ట్ర హైకోర్టు జడ్జి, జిల్లా పోర్ట్ ఫోలియో జడ్జి కుమారి బిఎస్ భానుమతిని కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 3900 పెండింగ్ కేసులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఆదోనిలో ఉన్న సబ్ కోర్టుకు వెళ్లేందుకు ప్రజలకు, కక్షిదారులకు, న్యాయవాదులకు, పోలీసులకు ఇబ్బందికరంగా ఉంద న్నారు. పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాలు కలిపి కొత్తగా రెవెన్యూ డివిజన్, పోలీసు సబ్ డివిజన్ ఏర్పాటు అయ్యాయని, పత్తికొండ లో సబ్ కోర్టు ఏర్పాటు చేస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పత్తికొండ కోర్టుకు రెగ్యులర్ జడ్జిని నియమించాలని విజ్ఞప్తి చేశారు.

ముగిసిన అంగన్‌వాడీ శిక్షణా తరగతులు

విశాలాంధ్ర – గూడూరు: బాల్యం సంరక్షణ, ప్రాథమిక విద్య బోధన, ఆహార పోషకాలపై నిర్వహించిన అంగన్వాడీ టీచర్ల శిక్షణ తరగతులు శనివారం విజయవంతంగా ముగిశాయి. మండల పరిషత్ సమావేశ భవనంలో సిడిపిఓ వరలక్ష్మి దేవమ్మ ఆదేశాలతో ఐసీడీఎస్ సూపర్వైజర్ జరీనాభాను అంగవై కల్యం నివారణపై అంగన్వాడి టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జరీనా భాను మాట్లాడుతూ చిన్నారుల సంరక్షణ, ప్రాథమిక విద్య బోధనలే లక్ష్యంగా సేవలందించాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు.

వడగండ్ల వాన

విశాలాంధ్ర – బ్యూరో కర్నూలు: గత 20 రోజుల నుంచి వేసవి తాపాని ఉక్కిరి బిక్కిరి అయిన జిల్లా ప్రజలు శనివారం సాయంత్రం కురిసిన వడగళ్ల వానకు ఉపశమనం పొందారు. వాతావరణ శాఖ శనివారం, అది, సోమవారాల్లో వర్షం కూరేసే అవకాశం ఉందని చెప్పారు. శనివారం కర్నూలు నగరంలో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. సి.బెళగల్‌లో వడగళ్ల వాన కురిసింది. కోడుమూరు తదితర ప్రాంతాల్లోను వర్షం కురిసింది.

గాలులతో కూడిన వడగండ్ల వాన..

విశాలాంధ్ర – సి బెళగల్ : మండల కేంద్రంలో శనివారం ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన సుమారు గంట సేపు కురిసింది. పొలాల్లో వర్షపు నీరు నిండుకొని గుంతలలోకి వర్షపు నీరువెళ్లి గుంతలు నిండాయి. రోడ్ల మీద ఉన్న గుంతలు నిండుకొని వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. వడగండ్లు పడుతున్న వేళ పిల్లలు ఆనందంతో రోడ్లపైకి చేరుకొని వాటిని ఒడిసి పట్టుకొని ఆటలాడుకోవడం, వడగండ్లను నోట్లో వేసుకొని పిల్లలు కేరింతల కొడుతూ ఆనందపడ్డారు. మార్చి నెలలో ఎండలు మెండుగా ఉన్నం దున భూమి వేడెక్కడంతో ఒక్కసారిగా భారీ వర్షం దాటికి భూమి చల్లబడ్డది. ఈ వర్షం రాకతో వేసవి ఎండల నుండి ఉపశమనంతో పాటు రైతులకు దుక్కులు దున్ను కోవడానికి ప్రయోజన కరమేనని రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మునుపటి పెద్దలు చెప్పిన ప్రకారం ఉగాది పండగ ముందు కచ్చితంగా భూమిలో ఉన్న ఉడుకు దుమ్ము అణగడానికి కచ్చితంగా వర్షం కురుస్తుందని పెద్దల నానుడి.

మరిన్ని వార్తలు E-PAPERలో..

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, ఆదివారం 23, మార్చి 2025

కబ్జాదారుల నుండి ప్రభుత్వ భూములను కాపాడాలి

విశాలాంధ్ర -పత్తికొండ: కబ్జాదారుల నుండి ప్రభుత్వ భూమిని కాపాడాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి క్రాంతి నాయుడు డిమాండ్ చేశారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పత్తికొండ లో భూ కబ్జాలు ఎక్కువ అయ్యాయి అని, అధికారులు అధికార పార్టీ నాయకులు కలిసి ప్రభుత్వ భూములను, దేవుని మాన్యాలను సైతం వదలకుండా కబ్జా చేస్తున్నా కాపాడాల్సిన అధికారులు సైతం మౌనం వహించడం ఆంతర్యం ఏమిటన్నారు. కన్యకాపరమేశ్వరి దేవాలయ సముదాయంలోని నగరేశ్వర స్వామి సర్వే నంబర్ 310/2లోని 13 ఎకరాలను స్వామి పేరు మీద ఉన్నా వేరే వారు అమ్మే పరిస్థితి ఏర్పడిందన్నారు. రామలింగేశ్వర స్వామి దేవాలయం భూమి 22 సెంట్లు వరిమళ్ళు లో 7 సెంట్లు కబ్జాదారుల పేరు మీద రిజిస్టర్ కావడం జరిగిందని ఆరోపించారు. ఆదోని రోడ్డులో సర్వే నెంబర్ 95లో వంకను కబ్జా చేశారని, ఆ వంక నుండి హంద్రీనీవా నీరుతో కదుగొమ్మ వంక నుండి చెరువు నింపే కాలువను ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉన్నా, కబ్జా దారులు ఆక్రమించుకోవడం జరిగిందన్నారు. జూటూరు గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 616/1లో సివిల్ సప్లై గోడౌన్‌కు రిజర్వ్ చేసిన భూమిలో, పార్వతి కొండ సర్వే నెంబర్ 190 లో అవకతవకలు జరిగాయన్నారు. కర్నూలు రోడ్డులో సర్వే నెంబర్ 706 లో రెవిన్యూ అధికారులే బినామీ పేర్లతో రిజిస్టర్ చేసుకొని పట్టాలు మంజూరు చేసుకోవడం జరిగిందన్నారు. సర్వే నంబర్ 710లో కబ్జా ప్రయత్నాలు మొదలు అయ్యాయని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అధికార పార్టీ ప్రతినిధులు, అధికారులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పట్టణ ఇంచార్జి హర్ష పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో ముగ్గురు పిల్లలకు తక్షణ ఆర్థిక సాయం

విశాలాంధ్ర -ఓర్వకల్లు: ఉప ముఖ్య మంత్రి ఆదేశాల మేరకు వికలాంగత్వంతో బాధపడు తున్న ముగ్గురు పిల్లలకు తక్షణ ఆర్థిక సహాయం అందచేశారు. ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అందచేశారు. శనివారం ఓర్వకల్లు మండలంలోని పూడిచెర్ల గ్రామ పరిధిలో ఫారం పాండ్ నిర్మాణ పనులను ప్రారంభించి, బహిరంగ సభ నిర్వహించిన సమయంలో దివ్యాంగత్వం తో బాధపడుతున్న తమ పిల్లలను ఆదుకోవాలని, సాయం చేయాలని బాధిత కుటుంబాలు ఉపముఖ్యమంత్రికి విన్నవించుకోగా, వారు వెంటనే స్పందించి, ఆర్థిక సహాయం చేయాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా ను ఆదేశించారు.ఎమ్మిగనూరు మండలం, పరమాన్ దొడ్డి గ్రామ నివాసి గొల్ల లక్ష్మన్న, గొల్ల జయమ్మ దంపతుల కుమార్తె శ్రావణి పుట్టుకతో మానసిక వైకల్యంతో బాధ పడుతూ, 14 సంవత్సరాల వయస్సు వచ్చినా, మంచానికే పరిమితం అయి, బాలిక లో ఎదుగుదల లేక అనారోగ్యంతో ఉందని, చిన్న టీ కొట్టుతో జీవనం సాగిస్తున్నామని, ఆదుకోవాలని కోరి అర్జీ సమర్పించారు. ఓర్వకల్లు మండలం బైరాపురం గ్రామ నివాసి భాస్కర్, లక్ష్మి దంపతులకు ఉన్న నలుగురు పిల్లలలో జ్యోతి, చందు ఇద్దరూ పుట్టుకతో వికలాంగులని, ఆర్థిక సహాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ రెండు కుటుంబాల పిల్లలను చూసి, చలించి, అనారోగ్యంతో ఉన్న పిల్లలను ఆదుకునేందుకు తక్షణ ఆర్థిక సాయం చేయాలని ఉప ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. వారి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ వెంటనే వారిని పిలిపించి, ఒక్కొక్కరికి రూ. 50 వేల చొప్పున రెండు కుటుంబాలకు చెందిన ముగ్గురు పిల్లలకు చెక్కులను అందించారు. తమ బాధలు విని వెంటనే ఆర్థిక సహాయాన్ని అందజేసిన ఉపముఖ్యమంత్రికి, జిల్లా కలెక్టర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి గొల్ల లక్ష్మన్న, భాస్కర్ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: పారిశ్రామికవేత్తలు వారు నడుపుతున్న పరిశ్రమలలో ఉత్పత్తి విధానంలో వచ్చే వృధా ఖర్చును అధిగమించిందికే అవగాహన సదస్సు జిల్లా పరిశ్రమ కేంద్రంలో ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సదస్సులో జనరల్ మేనేజర్ ఎస్. అరుణ ఆధ్వర్యంలో పరిశ్రమల కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఆమె ఈ సదస్సులో 50 లేక 60 మంది ఉత్పత్తి రంగానికి సంబంధించిన పరిశ్రమదారులు పాల్గొని వారి ఇచ్చిన సలహాలు సూచనలు తీసుకొని భవిష్యత్తులో టెక్నాలజీ అభివృద్ధిని ఉపయోగించి అనవసరమైన ఖర్చులు తగ్గించేందుకు ఉత్పత్తి విధానంలో ఉత్పన్నమయ్యే శ్రీకారం చుట్టారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ ఐ. విజయ్ కుమార్, సిక్కి ప్రెసిడెంట్ రాజమహేంద్రర్, జె.ఆర్ రెడ్డి, నేషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సంజన, డిక్కీ దిలీప్, దళిత ఇండస్ట్రీ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బరాయుడు, ఇండస్ట్రియల్ అధికారులు డానియల్ నూర్ అహ్మద్, హరిహర రెడ్డి పాల్గొన్నారు.

జల సంరక్షణ అందరి బాధ్యత

విశాలాంధ్ర - కర్నూలు సిటీ :జల సంరక్షణ అందరి బాధ్యతని రీజినల్ కాలుష్య నియంత్రణ మండలి ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ పీవీ కిషోర్ రెడ్డి అన్నారు. శనివారం ప్రపంచ జల దినోత్సవంలో భాగంగా ఏ.క్యాంప్ మాంటిసోరి హైస్కూల్లో లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అధ్యక్షతన నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడం పై అవగాహన కార్యక్రమం. వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ పి.వి కిషోర్ రెడ్డి,జిల్లా న్యాయ సేవాధి కార సంస్థ సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి బి.లీలా వెంకట శేషాద్రిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూగ ర్భ జలాలను పెంచే దిశగా వర్షపు నీటిని కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు. చెరువులు, కుంటల పునరుద్ధరణ భూగర్భ జలా లను పెంచేందుకు కీలకమవుతుందన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ ప్రతినిధి, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు పారా లీగల్ వాలంటీర్ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యర్థజలాలను శుద్ధి చేసి తిరిగి వ్యవసాయ అవసరాలకు ఉపయోగించడంపై అవగాహన కల్పించాలన్నారు.

కృత్రిమ మేధస్సు పాత్రపై సెమినార్

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: మెడికల్ కాలేజీలోని కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో ప్రజారోగ్య రీసెర్చ్‌లో కృత్రిమ మేధస్సు పాత్ర అనే అంశంపై ఇంటర్నీస్, పీజీ విద్యార్థులచే సెమినార్ జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ వైద్యరంగంలో ఇమేజింగ్ టెక్నాలజీ, డేటా అనలైజేషన్ మొదలగు విభాగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర మంచి ఫలితాలను ఇస్తుందని రాబోవుకాలంలో ప్రజారోగ్యానికి అవసరమయ్యే ఏఐను ఉపయోగించుకొని చక్కటి ప్రణాళికలు రూపొందించుకోవచ్చన్నారు. వైద్యులకు రోగుల సేవలో ఏఐ ఎంతో ఉపయోగ పడుతుందని తద్వారా మరింత మెరుగైన సేవలు రోగులకు అందుతాయని అన్నారు. ఈ సెమినార్ యందు ప్రొఫెసర్ సింధియా శుభప్రద, అసోసియేట్ డాక్టర్ అరుణ, అసిస్టెంట్లు, డీసీహెచ్ఎస్‌లు డా.స్వర్ణ కుమారి, డా.రవి నాయక్, డా.వెంకటరమణ, డా.పుష్పలత, డా.ప్రవీణ, డా.వెంకటేశ్వర్లు, ఇంటర్నీస్ పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సు సర్టిఫికెట్ల పంపిణీ

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: మహిళలు భవిష్యత్తులో బ్యూటీషియన్ కోర్సు ద్వారా ఉపాధి పొందడానికి రాజ్ కుమార్ ఫౌండేషన్ అన్ని విధాల అందుబాటులో ఉంటుందని సంస్థ నిర్వాహకురాలు రత్నకుమారి తెలిపారు. శనివారం కర్నూల్ పట్టణ శివారులోని సెయింట్ జోసెఫ్ కళాశాలలో గత 45 రోజుల క్రితం రాజ్ కుమార్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఏర్పాటు చేసిన బ్యూటీషియన్ కోర్స్ శిక్షణ ముగియడంతో సర్టిఫికెట్లను విద్యార్థినులకు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళ ఉపాధి కోసమే శిక్షణను తీసుకొని వారి జీవనోపాధిని మెరుగుపరచుకోవాలని మహిళలందరికీ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శాంత, లైబ్రరీ రఫియా బేగం, కళాశాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శివుడి ఆజ్ఞతో అన్నదాన కార్యక్రమం

విశాలాంధ్ర - ఆదోని రూరల్: శ్రీ భ్రమరాంబ దేవి పరమేశ్వరుల ఆజ్ఞతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వెళ్లే పాదయాత్రిలకు,ఉగాది పర్వదిన బ్రహ్మోత్సవాలకు పాదయాత్రగా శ్రీశైల పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రతి ఏడాది నిర్వహించడం జరుగుతుందని, నేటికీ మూడవ రోజు కొనసాగించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని అన్నదాన కార్యక్రమ నిర్వాహకుడు అల్కురి మఠం మహర్షి విజయ్ కుమార్ స్వామి తెలిపారు. కర్ణాటక ప్రాంతం నుంచి శ్రీశైల మహా పుణ్యక్షేత్రానికి ఆదోని మీదుగా ఎర్రని ఎండను లెక్కచేయకుండా వేలాది మంది భక్తులు పాదయాత్ర కాస్త ఉపశమనం కలిగే విధంగా అన్నదాన కార్యక్రమం తో పాటు, చల్లని మజ్జిగ, మంచి నీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. వేలాదిమంది యాత్రికులకు సేవ చేసే అదృష్ట భాగ్యంగా భావిస్తున్నామన్నారు.

మంత్రిని పరామర్శించిన ఎమ్మెల్యే దంపతులు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : న్యాయశాఖ మంత్రి ఫరూక్ భార్య షహనాజ్ అనారోగ్యంతో శుక్రవారం మరణించిన విషయము విధితమే. ఇందులో భాగంగా శనివారం ఎమ్మెల్యే అఖిలప్రియ, భార్గవ్ రామ్ దంపతులు హైదరాబాదులోని మంత్రి ఫరూక్ నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆయనతోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

నూతన డ్రైనేజీ నిర్మాణ పనులు

విశాలాంధ్ర - రుద్రవరం: మండల కేంద్రంలోని దళిత కాలనీ నుండి పోలీస్ స్టేషన్ మీదుగా 250 మీటర్లు మేర పొడవున నూతన డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం తెలిపారు. ఈ సందర్భంగా శని వారం ఆయన పోలీస్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న కల్వర్టు పనులను ఆయన పరిశీలించారు. మండలంలో నూతన డ్రైనేజీ కాలువల ఏర్పాటు వల్ల పారిశుద్ధ్యం లోపించకుండా ఉంటుందన్నారు. దీంతో వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత ఏర్పడుతుందని ఆయన తెలిపారు.

కేజీబీవీ ప్రవేశాల్లో దరఖాస్తుకు ఆహ్వానం

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: రాష్ట్ర పథక సంచాలకులు, సమగ్ర శిక్ష వారి ఆదేశాల మేరకు, కర్నూలు జిల్లాలోని 26 కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయములలో 2025-26 విద్యాసంవత్సరానికి గాను, 6వ తరగతి మరియు ఇంటర్ మొదటి సంవత్సరం తరగతిలో ప్రవేశానికి ఆన్లైన్ లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి, ఎస్.శామ్యూల్ పాల్, సమగ్ర శిక్ష అదనపు పదక సంచాలకులు టి.శ్రీనివాసులు ఒక సంయుక్త ప్రకటనలో తెలియజేశారు, జిల్లాలోని 26 కేజీబీవీ లలో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం తరగతిలో 40 సీట్ల చొప్పున 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. 10 తరగతిలో ప్రవేశాలకు అనుమతి లేదు. అనాథ పిల్లలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద ఎస్సీ ఎస్టీ బీసీ, మైనారిటీ, బిపిఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ముస్లిం మైనారిటీ విద్యార్థినులకు కల్లూరు, ఆదోని నందు ప్రత్యేక పాఠశాలలు కలవు. వాటిలో పేద ముస్లిం విద్యార్థినులకు అధిక ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఈనెల 22వ తేది నుండి మే 11 2025 వ తేదీ వరకు apkgbv.apcfss.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చు. ఆన్ లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్స్ కొరకు పరిగణించబడతాయి. ఎంపికైన విద్యార్థినులకు ఫోన్ ద్వారా సమాచారం పంపబడుతుంది. మరిన్ని వివరాలకు సమీపంలోని కజీబీవి ప్రిన్సిపాల్, సమగ్ర శిక్ష కర్నూలు, గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ అధికారిణి 9000204936 సంప్రదించాలన్నారు.

రజక వృత్తిదారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

విశాలాంధ్ర - కోడుమూరు : విశ్వకర్మ కౌశల్య యోజన పథకం శిక్షణ పొందిన లబ్ధిదారులకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలని, తక్షణమే రజక వృత్తిదారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం భాస్కరయ్య కోరారు.శనివారం కోడుమూరు పట్టణంలోని స్థానిక తుల్జాభవాని కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం ఆరవ జిల్లా మహాసభ జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కరయ్య, వృత్తి సంఘాల సీనియర్ నాయకులు జి.రామకృష్ణ,రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజు, రజక ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సి.సిద్ధప్పలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మహాసభ జిల్లా అధ్యక్షుడు ముక్కన్న,జయమ్మ,శేషాద్రిల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా సీనియర్ నాయకులు రాముడు జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం వారంతా ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రజక రాష్ట్ర కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు నిధులు కేటాయించి రజకులకు బీసీ కార్పొరేషన్ ద్వారా సొసైటీలు ఏర్పాటు చేసి రుణాలు ఇవ్వాలన్నారు. ప్రతి గ్రామానికి ధోబి ఘాట్లు ఏర్పాటు చేయాలని అన్నారు జీవో నెంబర్ 27 ప్రకారం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులు భర్తీ చేసి రజక కుటుంబంలో ఉన్న యువతీ, యువకులకు ఉపాధి కల్పించాలని కోరారు.రజకులకు మోడ్రన్ దోబీ ఘాట్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రజకులపై దాడులు, సాంఘిక బహిష్కరణలు జరుగుతున్నాయని, వీటిని అరికట్టడానికి రజకులకు ఎస్సీ, ఎస్టీ తరహాలో రక్షణ చట్టం ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కౌసల్య విశ్వకర్మ ద్వారా రజకులకు జిల్లాలో దాదాపు 5వేల మందికి వారం రోజులు పాటు ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. ట్రైనింగ్‌లో రోజుకు 500 చొప్పున వారం రోజులపాటు నాలుగు వేలు అకౌంట్ లో జమ చేస్తామన్నారని అన్నారు. ట్రైనింగ్ 5నెలల అయినప్పటికీ అకౌంట్లో జమ కాలేదన్నారు.కావున ట్రైనింగ్ పొందిన వారందరికీ రూ.4 వేలు జమ చేయాలన్నారు. రూ.15 వేల కిట్టు అందించాలని కోరారు. బ్యాంకుల ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తామని చెప్పిన రుణాలు అందించాలని వారు డిమాండ్ చేశారు. భవిష్యత్ పోరాటాలకు జిల్లాలో ఉండే రజక వృత్తిదారులు, మేధావులు, ఉద్యోగస్తులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు.

నూతన కమిటీని ఎన్నిక : గౌరవ అధ్యక్షులుగా సి.హనుమంతు అధ్యక్షులుగా ముక్కన్న,ప్రధాన కార్యదర్శిగా సి.గురుశేఖర్, ట్రేజరర్‌గా సిహెచ్ శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు సి.శేషాద్రి, పర్ల సుంకన్న, శేఖర్ బాబు,సహ కార్యదర్శులుగా జయమ్మ,వీరన్న, బాలు,43 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.ఈ మహాసభలో వివిధ మండలాల నాయకులు రామన్న, ఎల్లయ్య, రమణ, కబీర్, నాగరాజు, అంజి, రామలింగప్ప, బడిసా, మద్దిలేటి, ఉరుకుందు, ఊరుకుందు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జిల్లా బార్ అసోసియేషన్ వార్షికోత్సవం

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: జిల్లా బార్ అసోసియేషన్ యానివర్స్ డే జిల్లా కోర్టు ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బిఎస్ రవికాంత్ ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు దీనికి ముఖ్య అతిథిగా చీఫ్ గెస్ట్ జస్టిస్ బిఎస్ భానుమతి, జస్టిస్ శ్రీనివాస్ రెడ్డి, జస్టిస్ హరినాథ్ రెడ్డి, జస్టిస్ హరి హరినాధ శర్మ హాజరై వారు మాట్లాడుతూ న్యాయవాదులకు బెంచి మధ్య సమన్వయం ఉండాలన్నారు. జూనియర్ న్యాయవాదులు ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదివి మంచి స్థాయిలో రావాలన్నారు. సీనియర్లు ఏ విధంగా ఫైలింగ్ చేస్తున్నారు చూసుకోవాల్సిన బాధ్యత జూనియర్లదని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి కబర్ది, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ పి రవి గువేరా, కర్నూల్ నంద్యాల న్యాయమూర్తులు రాయలసీమ న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ నందు మండల ఎంఎస్పి అధ్యక్షులు గోపాల్ దస్తగిరి ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో దశాబ్దాలుగా పోరాటం చేశామని, పోరాటంలో ఎందరో మాదిగ వీరులు ప్రాణ త్యాగం చేశారన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నాయకులు మంద శ్రీనివాసులు,మంద నారాయణ, మాణిక్ భాష, మంద వెంకటేశ్వర్లు, చిరంజీవి, సుబ్బయ్య, మంద గోపాల్, చిన్నపుల్లన్న,భాస్కర్, చిన్న సుబ్బరాయుడు, నాగార్జున, రమాదేవి, దస్తగీరమ్మ, మాధవి, ఇంద్రాణి, ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

చిన్న కొప్పెర్లలో చోరీ..

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: మండల పరిధిలోని చిన్న కుప్పెర్ల గ్రామానికి చెందిన దూదేకుల పెద్ద దస్తగిరి ఇంట్లో శనివారం గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన పెద్ద దస్తగిరి తాను పండించిన మిరప పంటను గుంటూరుకు తీసుకెళ్లి వచ్చిన డబ్బును, ఇంట్లో ఉన్న కూలీ డబ్బులతో పాటు రూ.1.70 శుక్రవారం ఇంట్లో ఉంచాడు మరుసటి రోజు శనివారం ఉదయం పెద్ద దస్తగిరి కొడుకు, భార్య, కూతురు మిరప పంట కోతకు వెళ్లారు. పెద్ద దస్తగి రికి డబ్బులు వచ్చిన విషయం తెలుసుకున్న గుర్తుతెలియని వ్యక్తులు శనివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి రూ.1.75 లక్షల నగదుతో పాటు బుట్ట కమ్మలు ఆపరించి కొని వెళ్లారు. విషయం తెలుసుకున్న పెద్ద దస్తగిరి రేవనూరు పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు చేసిన వెంటనే రేవనూరు ఎస్ఐ భూపాలుడు సంఘటన స్థలానికి చేరుకొని పూర్తి వివరాలు తెలుసుకున్నారు. నంద్యాల నుండి క్లూజ్ టీం ను పిలిపించి పూర్తిస్థాయి విచారణ చేపట్టారని ఎస్సై భుపాలుడు తెలిపారు.

ఆళ్లగడ్డలో వర్షం.. చల్లబడ్డ వాతావరణం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ ప్రాంతంలో శనివారం సాయంత్రం వర్షం కురిసింది.. ఉరుములు మెరుపులతో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో కొన్ని రోజులుగా ఎండ, ఉక్కపోతకు ఇబ్బందులు పడ్డ ప్రజలకు వర్షం కురవడంతో ఉపశమనం లభించింది. సాయంత్రము ఒక్కసారిగా ఆకాశం మేఘాలు మేఘావృత్తమై చల్లటి వాతావరణం నెలకొనడంతో ప్రజలు ప్రకృతిని ఆస్వాదించారు. పట్టణంలోని సిఎస్ఐ చర్చి వెనకన ఉన్న చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో పాటు మరి కొన్నిచోట్ల విద్యుత్ తీగలపై చెట్టు పడటంతో పట్టణంలో గంటకు పైగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఉయ్యాలవాడ మండలంలోనీ మాయలూరులో భారీ వర్షం కురిసింది. బస్టాండ్ సమీపంలోని భారీ వృక్షం విరిగి రోడ్డుకు అడ్డంగా పడడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. కాగా దిగుబడులు చేతికొచ్చేవేళ అకాల వర్షం కురవడంతో మిరప, మొక్కజొన్న తదితర రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు కల్లాల్లో ఉంచిన ఎండుమిర్చి తడిసిపోయింది.

వన్య ప్రాణుల దాహార్తి తీర్చేందుకు సాసర్ పీట్లు

విశాలాంధ్ర - రుద్రవరం : నల్లమల అడవుల్లో వన్య ప్రాణుల దాహార్తినీ తీర్చేందుకు చర్యలు చేపట్టినట్లు చలమ రేంజ్ పెద్ద కంబలూరు ఫారెస్ట్ సెక్షన్ అధికారి కిషోర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ చెలమ ఫారెస్ట్ రేంజ్ అధికారి ఉదయ్ దీప్ ఆదేశాల మేరకు పెద్ద కంబలూరు ఫారెస్ట్ సెక్షన్ పరిధిలో ఉన్న నల్లమల అటవీ ప్రాంతంలో సాసర్ ఫిట్‌లలో ట్యాంకర్లతో నీటిని నింపడం జరుగుతుందన్నారు. ఇందులో నీరు పది రోజులకుపైగా నిల్వ ఉంటుందన్నారు. ఈ నీటిని అడవుల్లో సంచరించే వన్యప్రాణులు తాగి వాటి దాహార్తిని తీర్చుకుంటాయన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని వారానికి ఒకరోజు సాసర్ ఫిట్‌లలో నీరు నింపడం జరుగుతుందన్నారు. అడవుల్లో సంచరించే జంతువులకు నీటి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఉండేందుకు సాసర్ ఫిట్‌లలో ఉండే నీరు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అటవీ తీర ప్రాంతంలో ఉండే రైతులు పంట పొలాల దగ్గరకు వచ్చే జంతువులకు ఎటువంటి హాని తలపెట్టవద్దన్నారు. సాసర్ ఫీట్లలో నీటిని బీట్ ఆఫీసర్ రామారావు సిబ్బంది నింపడం జరిగిందన్నారు.

వైద్యశాల కార్యాలయ సిబ్బందితో సమీక్ష

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల పరిపాలనా సిబ్బందితో సమీక్ష సమావేశము శనివారం మధ్యాహ్నం నిర్వహించారు. హాస్పిటల్ పర్యవేక్షకులు డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆసుపత్రి, కళాశాలల వద్ద అందుబాటులో ఉన్న అన్ని ఇతర నిధులు, మందులు ఔషధాల సేకరణ, లాజిస్టిక్స్, శస్త్రచికిత్సా వైద్య పరికరాలు, ఆసుపత్రికి అవసరమైన వస్తువులు, సౌకర్యాల నిర్వహణకు సంబంధించిన అన్ని ఒప్పందాలు, ఏసీలు, లిఫ్ట్‌లు, ఎస్‌టీపీ, నీటి సరఫరా వాటిపై సంక్షించినట్లు తెలిపారు.

ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా నోడల్ అధికారి

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: తిప్పాయపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు పరిశీలించారు. శనివారం తిప్పయపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయం నందు జరుగుచున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణీ, పిల్లలకు వ్యాదినిరోధక టీకాలు వ్యాధుల బారిన పడకుండా రక్షణ కల్పిస్తాయన్నారు. తల్లులు తమ పిల్లలకు సమయానుసారంగా వ్యాదినిరోధక టీకాలు వంద శాతం ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ కృష్ణ బాయి, సామాజిక ఆరోగ్య అధికారి సుమలత, యశోద ఆరోగ్య కార్యకర్తల, ప్రాజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

ముగిసిన అంగన్వాడీల శిక్షణ కార్యక్రమం

విశాలాంధ్ర - అవుకు : మండలంలోని గుండ్ల సింగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణా కార్యక్రమాలు మూడవరోజు శనివారంతో ముగిశాయి. మూడవరోజు శిక్షణ కార్యక్రమంలో సూపర్వైజర్లు శివమ్మ, పావనిలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలలో దివ్యాంగులను ఎలా గుర్తించాలి, వారి వయసుకు తగ్గ మైలురాళ్ల గురించి, వారికి సమాన విద్య గురించి వివరించామని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పెద్దవంగలిలో హుండీల లెక్కింపు

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని పెద్దవంగలి గ్రామంలో శ్రీ హజరత్ దస్తగిరి స్వామీ హుండీల లెక్కింపు కార్యక్రమం శనివారం చేపట్టారు.దర్గా ప్రాంగణంలో ఎస్ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు,గ్రామ పెద్దల సమక్షంలో హుండీలు తెరచి లెక్కించారు. భక్తులు 2025 ఉరుసుకు సంబంధించి రూ 2,39,920ల నగదును భక్తులు హుండీలలో సమర్పించారు. ఈ సొమ్ముతో దర్గాను అభివృద్ధి చేయాలని ఎస్ఐ సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నబీ,దర్గా కమిటీ సభ్యులు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పంట నీటి కుంటలను నిర్మించి సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పంటకు అవసరమయ్యే నీటిని నీటి కుంటల ద్వారా సమకూర్చుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి రైతులను సూచించారు. శనివారం ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా నీటి కుంటల ప్రారంభిస్తున్న సందర్భంగా మహానంది మండలం గాజులపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పంట నీటి కుంటల కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. డ్వామా పిడి వెంకటసుబ్బయ్య తదితరులు కలెక్టర్ వెంట పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల్లో నీటి కుంటలను ఏర్పాటు చేసుకొని పంటలకు అవసరమయ్యే నీటిని నీటి కుంటల ద్వారా సమకూర్చుకోవాలని రైతులను సూచించారు. నీటి గుంటల కింద కూరగాయల సాగును కూడా చేపట్టవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నీటి కుంటలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో నంద్యాల జిల్లాలో 3 వేల వరకు నీటి కుంటలు ఏర్పాటు చేసే దిశగా లక్ష్యాన్ని నిర్దేశించారన్నారు. జిల్లాలో 1/3 వంతు భూములు ఉపరితళంగా ఉండడం, ఆర్ఓఎఫ్ఆర్ భూములు ఉన్న కారణంగా కమ్యూనిటీ ఫామ్ పాండ్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో జిల్లాలోని రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జిల్లాలో 3 మీటర్ల నుండి 25 మీటర్ల లోతు వరకు నీటి సాంద్రత ఉన్న గ్రామాలు ఉన్నందున మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో పెద్ద ఎత్తున నీటి కుంటలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పనులకు హాజరయ్యే వేతనదారులు కూడా ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఉదయాన్నే పనులకు త్వరగా వచ్చి ఉ.11 గంటల లోపు ముగించుకొని వెళ్లేలా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉపాధి హామీ వేతనదారులకు ప్రభుత్వం నుండి రావాలసిన సహాయ, సహకారాలు అందుతాయని కలెక్టర్ తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల సూచనల మేరకు ఉపాధి హామీ పనులు సక్రమంగా పూర్తి చేసిన వారికి రోజుకు మూడు వందల రూపాయల వరకు వేతనం రావడం జరుగుతుందన్నారు